క్లుప్తంగా

డివిజన్‌లో కార్పొరేటర్ పర్యటన

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని విజ్ఞాన్‌పురి కాలనీ, బలరాం నగర్, సాయిన గర్ కాలనీల్లో అధికారులతో కలిసి బుధవారం కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు డివిజన్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏఈ శ్రావణ్‌కుమార్, వాటర్‌వర్క్స్ కుమార్, హార్టికల్చర్ డిపార్టుమెంట్ ప్రియాంక, ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరేష్, ఎస్ఆర్‌పీ వినయ్‌కాంత్‌రెడ్డి, వర్కు ఇన్‌స్పెక్టర్ సూర్య, వీధిలైట్ల సూపర్‌వైజర్ భద్రయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ



బుక్స్ అందజేస్తున్న రవికుమార్ యాదవ్

ఆల్విన్‌కాలనీ: డివిజన్‌లోని శంషీగూడ, ఎల్లమ్మబండ ప్రభుత్వ పాఠశాలల్లో సందయ్య మెమోరియల్ ట్రస్ట్ సెక్రటరీ రవికుమార్ యాదవ్ సమక్షంలో బుధవారం నోట్ బుక్స్ పంపిణీ చేపట్టారు. 22 సంవత్సరాలుగా నియోజవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. అధికారంలోఉన్నా లేకున్నా పేదప్రజలకు సేవ చేయడమే తన తండ్రి భిక్షపతియాదవ్ చూపిన మార్గమని తెలిపారు. కార్యక్రమంలో నర్సింగ్‌యాదవ్, నరసింహా చారి, అరుణ్ కుమార్, కుమార్ యాదవ్, కమలాకర్‌రెడ్డి, సీతారామరాజు, కృష్ణగౌడ్, ఎత్తరి రమేష్, నర్సింగ్, కృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, సురేష్, రాము, చాంద్ సైదమ్మ, పద్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం అందజేత



రోగుల సహాయకులకు అల్పాహారం అందజేస్తున్న పల్లపు వేణు

మోతీనగర్: అన్ని దానాల కన్నా అన్నదానం మహా గొప్పదని కాంగ్రెస్ యువజన విభాగం సీనియర్ నాయకుడు పల్లపు వేణు పేర్కొన్నారు. బుధవారం అల్లాపూర్ డివిజన్ ఆర్‌కే సొసైటీకి చెందిన పల్లపు వేణు ఆసుపత్రి వద్ద రోగులకు అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో వైద్యం కోసం వచ్చే రోగులు, సహాయకులకు ఆహారానికి తీవ్ర ఇబ్బందులు పడుతుంటారని అన్నారు. ఖరీదైన హోటల్‌లో భోజనం చేసే పరిస్థితి ఉండదనే ఉద్దేశంతో వారికి తోచిన సహాయంగా అల్పాహారం అందజేశానని తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



దత్తాత్రేయకాలనీ ఫేజ్-2లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ కాలనీ ఫేజ్ 2లో రూ.10 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రావణి, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్, నాయకులు సమ్మారెడ్డి, కాశీనాథ్‌యాదవ్, శ్రీనివాస్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని హబీబ్‌నగర్‌లో వేస్తున్న సీసీ రోడ్డు పనులను బుధవారం మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రోడ్డు పనులను వేగవంతం చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలను ఉల్లంఘించకుండా నాణ్యతతో కూడిన పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌కు సూచించారు.





దళిత బంధు పథకంపై అవగాహన కల్పిస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, పాల్గొన్న కార్పొరేటర్లు, దళితులు

దళితుల అభ్యున్నతికే దళితబంధు

- పథకంపై దళితులకు అవగాహన కార్యక్రమం
- డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్‌లో దళిత బంధు పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 900 మంది దళితులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో ఎక్కడా లేనటువంటి సంక్షేమ పథకాలతో, అభివృద్ధి కార్యక్రమాలతో తెలంగాణ రాష్ట్రాన్ని ముందంజలో నిలబెట్టారన్నారు. నేడు దళితులు ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు వెళ్లేందుకు దళిత బంధు ద్వారా వారికి పది లక్షల రూపాయలను అందించి వారి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేలా సహాయ పడుతున్నారన్నారు.

- ఈ పథకం ద్వారా లబ్ధిదారులు వారు ఎంచుకున వ్యాపారానికి సంబంధించి ముందుగా అవగాహన పెంచుకొని ముఖ్యమంత్రి కేసీఆర్ అందించే రుణం ద్వారా ఆర్థిక ఉన్నతి సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పథకానికి సంబంధించి ఎవరైనా బయట వ్యక్తులు, కార్యకర్తలైనా లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
- కూకట్‌పల్లి నియోజకవర్గంలో సంక్షేమ పథకాలతో పాటు వేలకోట్ల అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని ప్రతిపక్షాలకు ఇవన్నీ కనబడటం లేదా అని ఆయన ప్రశ్నించారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని బాలానగర్ ఫ్లై ఓవర్, అనేక రకాల పార్కులు, నూతన డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం, 24 గంటల విద్యుత్, ఇంటింటికీ మంచినీరు అందిస్తూ ముందుకు సాగుతున్నామని అన్నారు.
- నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకొని భవిష్యత్‌లో కూడా వీటికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నారని గుర్తు చేశారు. ఎంపీగా గెలిచిన రేవంత్ రెడ్డి నియోజకవర్గానికి ఎన్నిసార్లు వచ్చారు? ఏం పనులు చేశారో? కూడా ఎవరికీ తెలియదని విమర్శించారు.
- తమ స్వార్థం గురించి ఆలోచించే కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఇకపైన కళ్లు తెరవాలని అన్నారు. కార్పొరేటర్లు మందడి శ్రీనివాస రావు, పగుడాల శిరీష బాబురావు, జూపల్లి సత్యనారాయణ, సబిహా బేగం, మాజీ కార్పొరేటర్లు శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ అంబులెన్స్ సేవలు షురూ..



కూకట్‌పల్లి ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్స్‌లో అంబులెన్స్‌లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: ఆపద వస్తే అత్యవసర వైద్య సేవలు అందించేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ 466 అంబులెన్స్‌లను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నియోజకవర్గానికి చెందిన 108, 102 వాహనాలను ఎన్‌కెఎన్ఆర్ గార్డెన్స్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదలకు అండగా ఎన్నో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధితో తెలంగాణ రాష్ట్రాన్ని ముందుకు నడిపే గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ఆపద వస్తే నేనున్నానంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ భరోసా ఇవ్వటం మన అదృష్టమన్నారు. అదే విధంగా గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా తన సొంత నిధులతో గత రెండేళ్ల క్రితం రూ.44లక్షలతో రెండు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచామన్నారు. వీటికి అదనంగా ప్రభుత్వం కేటాయించిన ఈ అంబులెన్స్‌లు కూడా నియోజకవర్గంలో వైద్య సేవలు అందించడానికి అందుబాటులో ఉంటాయని తెలిపారు.

సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధికి పెద్దపీట

పాదయాత్రలో ఎమ్మెల్యే కృష్ణారావు









ఓల్డ్ బోయిన్‌పల్లి పాదయాత్రలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రజలను నేరుగా కలుస్తుండటంతో సమస్యలు తెలుస్తున్నాయని వాటిని అక్కడికి అక్కడే పరిష్కరిస్తూ ముందుకు వెళ్తుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. పాదయాత్ర రెండో రోజు బుధవారం ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలిసి శ్రీసాయి ఎన్‌క్లేవ్, బడేగూడ, మదర్సా, ముస్లింబస్తీ, యాదవబస్తీ, కుమ్మరిబస్తీ, యాదిరెడ్డి కాలనీ తదితర కాలనీల్లో పర్యటించారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తక్షణమే రోడ్లు, డ్రైనేజీలను సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

- కలుషిత నీటి సమస్యను సైతం పరిష్కరించాలన్నారు. అప్పటి బోయిన్‌పల్లికి ఇప్పటి బోయిన్‌పల్లికి చాలా తేడా ఉందని దానికి కారణం తాము చేసిన అభివృద్ధేనని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్‌గౌడ్, బల్వంత్‌రెడ్డి, మక్కాల నర్సింగ్‌రావు, కర్రె జంగయ్య, కర్రె లావణ్య, వేణుగోపాల్‌రెడ్డి, ఇర్ఫాన్, మేకల హరినాథ్, బుర్రి యాదగిరి, రాజుగౌడ్, జహంగీర్, ఇబ్బు, ఖాదీర్, మల్లేష్‌యాదవ్, చందు, పోచయ్య, ఉదయ్, లలితా, ఉదయరాణి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



మహిళలకు మందులు అందజేస్తూ..

గ్రామీణ ప్రాంతాలకు మంచినీరు అందించడమే లక్ష్యం

'ఎస్కీ' డైరెక్టర్ డా.రామేశ్వరరావు

రాయదుర్గం: గ్రామీణ ప్రాంతాలకు సురక్షితమైన తాగునీటిని అందించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలోని చాణక్య సెమినార్ హాల్‌లో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రజారోగ్య విభాగం ఇంజనీర్లకు ' జల్‌జీవన్ మిషన్ కింద గ్రామీణ నీటి సరఫరా పథకాల ప్రతిభావంతమైన అమలు' అంశంపై ఇంజనీర్లకు ప్రత్యేకంగా మూడు రోజులపాటు శిక్షణా కార్యక్రమాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాగునీటి సరఫరాకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాయని, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందిపై ప్రత్యేక బాధ్యత ఉంటుందన్నారు. అందుకోసం వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. ఎస్కీ ఈఆర్‌డీ హెడ్ రాజశేఖర్ రెడ్డి, ఫ్యాకల్టీ నరేష్, అధికారులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని దీన్‌దయాల్ నగర్‌లో తలెత్తిన డ్రైనేజీ సమస్యను సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తానని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ హామీ ఇచ్చారు. బుధవారం ఆయన జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ డీఈ శ్రీదేవి, ఏఈ పవన్, వాటర్ వర్క్స్ డీజీఎం సంతోష్ అధికారులతో కలిసి దీన్‌దయాల్ నగర్‌లో పర్యటించి స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్యను వారు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు.

- ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీన్‌దయాల్ నగర్‌లో కొన్ని మ్యాన్‌హోల్స్‌లో చెత్తా చెదారం పేరుకుపోయి మురుగు రోడ్డుపై పారుతుందన్నారు. మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఫతేనగర్ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తానన్నారు. ఇప్పటికే కోట్ల నిధులతో డివిజన్ అభివృద్ధికి కేటాయించగా కొత్తగా నిర్మాణ పనులకు ప్రత్యేక నిధులను మంజూరీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. సకాలంలో పనులు చేపట్టి, ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో మహేందర్, సాయిలు, అశోక్, ప్రసాద్, రాజేశ్వర్‌రెడ్డి, రామ్ బద్రి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొట్టడంతో మహిళకు తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన అంజలి

భాగ్యనగర్‌కాలనీ: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కూకట్‌పల్లి మోర్ సూపర్ మార్కెట్ సమీపంలో యోగిత రెసిడెన్సీలో నివాసముంటున్న అంజలి కూకట్‌పల్లి నుంచి తన ద్విచక్ర వాహనంపై వివేకానందనగర్ వెళ్తోంది. ఈ క్రమంలో నెక్సాస్ షోరూమ్ వద్ద యూటర్న్ తీసుకుంటోంది. అతి వేగంగా వచ్చిన టిప్పర్ ఆమె ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో అంజలి బైక్‌పై నుంచి కింద పడిపోయింది. దీంతో ఆమె కాళ్లపై నుంచి టిప్పర్ వెళ్లటంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు టిప్పర్ డ్రైవర్‌ను పట్టుకొని పోలీసులకు అప్పగించి బాధితురాలిని చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించారు.

కాంగ్రెస్ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

మూసాపేట: మూసాపేట డివిజన్ బీ-బ్లాక్ అధ్యక్షులు గోపిశెట్టి రాఘవేందర్ అధ్యక్షతన బుధవారం నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ మూసాపేట డివిజన్ కార్యవర్గ సభ్యులకు నియామకపత్రాలను కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు. డివిజన్ అధ్యక్షుడు బొమ్మగాని సత్యనారాయణ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ అక్కల్‌దేవ్ మల్లేష్ యాదవ్, ఉపాధ్యక్షుడు మాచిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కోశాధికారి భిక్షపతి ముదిరాజ్, జనరల్ సెక్రటరి చకినాల కిరణ్‌కుమార్, పందు ముదిరాజ్, రాజు తోట, షేక్ మోపిన్, సెక్రటరి బాలరంగప్ప, జిల్లా శంకర్, కృష్ణ గౌడ్, జాయింట్ సెక్రటరి షకీల్, కురువా రాజు, మురళీ మోహన్ గౌడ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లు సయీద్ సలీమ్, రాంరెడ్డి, రమణారెడ్డి, రూపేష్ గొడికే, పాషాలు నియమించబడ్డారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ స్టేట్ జనరల్ సెక్రటరీ సయీద్ మిస్బా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తూము సంతోష్, కే. శ్రీనివాస్, తూము వేణు,శేఖర్‌గౌడ్, గురుమూర్తి, గోవింద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పేరుకే తొమ్మిదేళ్ల అభివృద్ధి

కూకట్‌పల్లి ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి

కూకట్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమస్యల పరిష్కారానికి పాదయాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కూకట్‌పల్లి నియోజకవర్గ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి బోయిన్‌పల్లి డివిజన్‌లోని సమస్యలకు సంబంధించిన పూర్తి సమాచారంతో ఎమ్మెల్యేపై విరుచుకుపడ్డారు. 9 సంవత్సరాలు డివిజన్‌లో 90 శాతం పనులు పూర్తి అయ్యాయని, డివిజన్ అభివృద్ధి చెందిందని చెప్పుకునే ఎమ్మెల్యే, కనీసం హస్మత్‌పేట్ వార్డు కార్యాలయం ఎదురుగా బస్ షెల్టర్‌ను కూడా వేయలేక పోయారని విమర్శించారు. అదే విధంగా చెప్పుకుంటూ పోతే ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో అనేక సమస్యలు ఉన్నాయని అన్నారు. డివిజన్‌లో 90శాతం అభివృద్ధి అనేది పచ్చి అబద్ధమని అన్నారు.

హెచ్‌సీయూకు ప్రతిష్టాత్మక ఐపీడీసీ గ్రాంట్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో కొనసాగుతున్న యునెస్కో చైర్ దేశీయ భాషలు, కమ్యూనిటీ రేడియోపై ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ డెవలప్‌మెంట్ ఆఫ్ కమ్యూనికేషన్ (ఐపీడీసీ) గ్రాంట్ మంజూరు చేశారు. స్థానిక భాషలను ప్రోత్సహించడానికి, కమ్యూనిటీ రేడియోల సామర్థ్యాలను బలోపేతం చేయడానికి యునెస్కో పారిస్‌లోని ప్రతిష్టాత్మకమైన ఐపీడీసీ ద్వారా హెచ్‌సీయూలోని కమ్యూనికేషన్ విభాగంలోని కమ్యూనిటీ మీడియాపై యునెస్కో చైర్‌కు పోటీ గ్రాంట్ లభించింది. చైర్ తన పనికోసం ఐపీడీసీ గ్రాంట్‌ను పొందడం ఇది నాలుగోసారి. 2027 వరకు హెచ్‌సీయూలో యునెస్కో చైర్ పునరుద్ధరించారని హెచ్‌సీయూ యునెస్కో చైర్ హోల్డర్ ప్రొఫెసర్ వినోద్ పవరాల పేర్కొన్నారు.

మేడ్చల్ జిల్లాలో భారీగా తహసీల్దార్ల బదిలీలు

పోస్టింగ్ ఉత్తర్వులను జారీ చేసిన కలెక్టర్ అమయ్ కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాకు చెందిన పలువురు తహసీల్దార్లకు రిలీవింగ్, ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారిని వివిధ మండలాలకు అలాట్ చేస్తూ బుధవారం పోస్టింగ్ ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ జారీ చేశారు.

ఇద్దరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రిలీవ్

మేడ్చల్ జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్లను పరిపాలన ప్రాతిపదికన బదిలీ చేస్తూ కలెక్టర్ అమయ్‌కుమార్ రిలీవింగ్ ఉత్తర్వులను అందజేశారు. పదోన్నతిపై డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఘట్‌కేసర్‌లో తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎస్.విజయలక్ష్మీ భద్రాచలం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా అలాగే, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న పి.పద్మప్రియ నిర్మల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు.

జిల్లాకు బదిలీపై వచ్చిన తహసీల్దార్లు..

ఇతర జిల్లాల నుంచి పలువురు తహసీల్దార్లు మేడ్చల్ జిల్లాకు బదిలీపై రాగా, వారికి పోస్టింగ్ ఉత్తర్వులను కలెక్టర్ జారీ చేశారు. హైదరాబాద్ జిల్లాలో తహసీల్దారుగా పనిచేస్తున్న బి.శైలజను మేడ్చల్‌కు, ఎస్.ఎమ్.హసీనాను మేడిపల్లికి అలాట్ చేశారు. జనగామ్ తహసీల్దార్ ఎల్.పూల్‌సింగ్‌ను బాచుపల్లికి, నల్గొండ జిల్లాలోని తహసీల్దార్లు సైదులును కుత్బుల్లాపూర్‌కు, కృష్ణారెడ్డిని ఉప్పల్‌కు, రంగారెడ్డి జిల్లా తహసీల్దార్లు టి.సుచరితను దుండిగల్ గండిమైసమ్మ మండలానికి, అలాగే, ఎల్.రాంమోహన్‌ను మేడ్చల్ కలెక్టరేట్ ఏవోగా, వై.ఎస్ శ్రీనివాస్‌ను బాలానగర్‌కు, అశోక్ కుమార్‌ను కీసరకు, వికారాబాద్ జిల్లాకు చెందిన సుధాలింగాను అల్వాల్ మండలానికి, సంగారెడ్డి జిల్లాకు చెందిన జె.స్వామిని కూకట్‌పల్లికి, సంగారెడ్డి జిల్లాకు చెందిన ఎం.సుజాతను కాప్రాకు, మేడ్చల్ జిల్లాకు చెందిన జి.కృష్ణను ఘట్‌కేసర్ మండలానికి, ఎల్.వెంకటేశ్వరరావును కీసర రెవెన్యూ డివిజన్ డీపీవోగా బదిలీ చేస్తూ పోస్టింగ్ ఉత్తర్వులు జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ జారీ చేశారు.

జిల్లా నుంచి బదిలీ అయిన తహసీల్దార్లు..

మేడ్చల్ జిల్లాలో తహసీల్దార్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.మహిపాల్‌రెడ్డి జనగామ జిల్లాకు, తహసీల్దార్లు పి.సంజీవరావు, ఎం.ఎస్తేర్ అనిత, కె.నాగమణి, వై.గౌరీవత్సల, ఎస్.ఆర్.సరిత సంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. తహసీల్దార్లు ఎం.సురేందర్, ఆర్.గోవర్ధన్, కె.గౌతమ్‌కుమార్ రంగారెడ్డి జిల్లాకు బదిలీ కాగా, తహసీల్దార్ డి.అహల్య హైదరాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. వీరందర్నీ రిలీవ్ చేస్తూ కలెక్టర్ అమయ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

నేటి నుంచి ఎన్‌వీఎస్ కబడ్డీ మీట్

రాయదుర్గం: జవహర్ నవోదయ విద్యాలయ రీజనల్ స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో జేఎన్‌వీ రీజనల్ స్థాయి కబడ్డీ పోటీలకు శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలోని జవహర్‌నవోదయ విద్యాలయ వేదిక కానుంది. గురువారం ప్రారంభమయ్యే ఈ పోటీలు శనివారం వరకు కొనసాగుతాయి. ఈ పోటీలలో తెలంగాణ రాష్ట్రం నుంచి మహబూబ్‌నగర్ క్లస్టర్‌నుంచి ఒక జట్టు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు, వెస్ట్‌గోదావరి నుంచి రెండు క్లస్టర్ల జట్లు, కర్నాటక రాష్ట్రం చిత్రదుర్గ, కల్బుర్గి, తుంకూరుల నుంచి మూడు క్లస్టర్ల జట్లు, కేరళ, తమిళనాడుల నుంచి ఒక్కో క్లస్టర్ జట్టు పాల్గొంటాయి. ఈ 34వ రీజనల్ స్థాయి కబడ్డీ పోటీలను ఎన్‌వీఎస్ హైదరాబాద్ రీజన్ డిప్యూటీ కమిషనర్ టి గోపాలకృష్ణ ప్రారంభిస్తారు.

లబ్ధిదారులకు ఇంటి హక్కు పత్రాలు



పాపిరెడ్డినగర్‌లో ఇంటి యజమానులకు ఆస్తిహక్కు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి కుటుంబాలకు వారు నివసిస్తున్న ప్రాంతంలో ఆస్తి హక్కులను కల్పించేందుకు జీవో 58, 59 ద్వారా అవకాశం కల్పించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డినగర్ కాలనీలో దరఖాస్తు చేసుకున్న వారికి యాజమాన్య హక్కులను కల్పిస్తూ మంజూరైన 22 మంది లబ్ధిదారులకు బుధవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నే శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావులతో కలిసి హక్కు పత్రాలను అందజేశారు.

- ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలుగా నివాసం ఉంటున్న నిరుపేదలకు జీవో నం.58 ప్రకారం రెగ్యులరైజ్ చేసి వారికి జీవితంపై భరోసా కల్పించిన గొప్ప మహానుభావుడు కేసీఆర్ అని కొనియాడారు. జీవో 59 ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన మొత్తం చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకొని ప్రభుత్వం కల్పించిన 5 శాతం రాయితీని సైతం పొందవచ్చన్నారు. ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న స్థల వివాదాలు సమస్యలతో పేద, మధ్య తరగతి కుటుంబాల యాజమాన్య హక్కు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారన్నారు.
- ప్రభుత్వం వీరిని గుర్తించి గొప్ప అవకాశం కల్పించిందని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానందనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు చంద్రారెడ్డి, కాశీనాథ్‌యాదవ్, గుడ్ల శ్రీనివాస్, ఆర్.భగవంత్‌రెడడ్డి, నరసింహులు ముదిరాజ్, సీహెచ్. రామకృష్ణారెడ్డి, ఎం. కనకరెడ్డి, వీరభాస్కర్, శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, శ్రీహరి, మోహన్, వి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

సీసీరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ శాతవాహననగర్ కాలనీలో రూ.55.10లక్షల అంచనా వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణ పనులను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడిగాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావుతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల మార్గదర్శకంలో నియోజకవర్గాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. అదే విధంగా హైదర్‌నగర్ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ సీసీ రోడ్డు నిర్మాణం చేసుకోవటం సంతోషించాల్సిన విషయమన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. సీసీరోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేస్తామన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.